కథ

# తెలుగువారం దరం

- వడ్డాలపు ప్రభాకర్



'డాడీ హౌ మెనీ మెంబర్స్ ఆఫ్ పాండవాస్' మా అన్నయ్య శ్రీనివాస్ వాళ్ల ఇంటి గుమ్మం ముందుకు వచ్చిన నాకు, వినిపించాయి ఆ మాటలు. మా అన్నయ్య కూతురు దీపిక గొంతు అని పోల్చుకునేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. పరదా తీయకుండానే షూస్ విప్పుతూ, చిన్నగా ఓ నవ్వు నవ్వేశాను, ఇంగ్లీష్ ఎంత కామన్ అయిపోయిందని!

"ఛీ! నీ వెధవ ఇంగ్లీషుతో విసిగించకే!" కాస్త కోపంతో పాటు, చిరాకుగా కుర్చీ లోంచి లేస్తూనే నన్ను చూసి, "ఏరా ఇప్పుడేనా రావడం?" అన్నాడు శ్రీనన్నయ్య.

"ఔనన్నయ్యా. చిన్న పని ఉండి వచ్చా చాలా రోజులైంది కదా మిమ్మల్ని ఓసారి చూసినట్టుంటుందని, కాస్సేపు మాట్లాడినట్టుంటుందని..." అంటూ కుర్చీ వెతుక్కోబోతుండగానే...

"హాయ్ బాబాయ్!" అంది దీపు... అదే దీపిక.

హాయ్ అనడాన్ని నేనెంత వ్యతిరేకించినా, చిన్నారి మనసును కష్టపెట్టలేక "హాయ్ చిట్టితల్లీ!" అన్నాను.

ఈ లోపు రొటీన్‌గా వంటింట్లో ఉండే మా వదినగారు బయటికి వస్తూనే, "ఏంటయ్యా, చాలా రోజులైంది... మమ్మల్ని మర్చిపోయావా?" పాత సినిమాల్లో డైలాగ్ మాడ్యులేషన్ మార్చినట్లుగా అనేసింది.

కాస్త మెలికలు తిరిగిపోతూ "అదేం లేదొదినా. బాగున్నారా?" నేనూ ఏదో సినిమాల్లోని వాక్యాన్ని కాపీ చేసి, గాల్లో కలిపేసి అన్నయ్య వైపు తిరిగి ఏదో చెప్పబోతున్నా.

"మమ్మీ మమ్మీ! హౌ మెనీ మెంబర్స్ ఆఫ్ పాండవాస్?" తన సందేహం తీరేవరకు ఎవరినీ వదలనన్నట్టుగా అడిగేసింది దీపు.

శ్రీనన్నయ్య గుర్రుగా చూస్తున్నాడు దీపు వైపు. "శుభ్రమైన తెలుగుండగా, ఈ ఇంగ్లీషు గోల ఏమిటి?" అని చాలాసార్లు నాతో అంటుండేవాడు. ఆయన కూడా పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదువు సాగించినా, ఇంజినీరింగ్ చేయాల్సి రావడంతో, ఇంగ్లీషు కంపల్సరీ అయిపోయింది. ఇంగ్లీషులో చదువు కన్నా తెలుగుదనాన్నీ, తెలుగు జ్ఞానాన్నీ, ఏ మాత్రం వదులుకోలేదు. కనీసపరిజ్ఞానమే కాదు, పఠనాన్ని కూడా అవలీలగా అర్థం చేసుకోగలిగే భాషాజ్ఞానం ఆయన సొంతం. "భాషపై మంచి పట్టు ఉన్న మనిషి" అని ఆయన చుట్టూ ఉండేవారు కితాబిస్తుంటారు.

"ఫైవ్ మెంబర్స్... వై?" అంది వదిన.

'రేపు మా ఎగ్జామ్స్ కదా" బదులిచ్చింది దీపు.

"ఓ మర్చేపోయాను" అంటూ మళ్లీ వంటింట్లో మిల్క్ బాయిలర్ ఈల వేస్తే, చటుక్కున పరుగుతీసింది.

అప్పటికే కోపంతో ఊగిపోతున్న శ్రీనన్నయ్య, "దీపూ... మాట్లాడితే ఇంగ్లీషులోనైనా మాట్లాడు. లేకపోతే తెలుగులోనైనా మాట్లాడు. అంతే గా, ఇలా మిక్సీలో వేసినట్లు తెలుగును ఇంగ్లీషులోనో, ఇంగ్లీషును తెలుగులోనో నంజుకు తినకే!" దాదాపు తల గొట్టుకుంటున్నట్లుగా అనేశాడు.

'ఏమిటండీ, మాట్లాడిన ప్రతిసారీ ఇంగ్లీషంటే విరుచుకు పడతారు?" పాల గ్లాసులో స్పూన్ తిప్పుతూ వచ్చి, దీపు చేతికి ఇచ్చింది వదిన.

"దీనికి దీని సమర్థింపొకటి. ఏమిటి ఆ భాష రేపు మా ఎగ్జామ్ కదా. ఏడ్చేదేదో ఇంగ్లీషులో ఏడవమను. లేకుంటే తెలుగులో ఏడవమను!"

"పోనీలే అన్నయ్యా, చిన్నపిల్ల. అయినా ఇంట్లో అంతా తెలుగు వాతావరణం, రోడ్డు పైనా తెలుగే. స్కూల్లో నేర్పే ఇంగ్లీషుతో అనర్గళంగా ఎలా మాట్లాడతారు?" అని ఏదో సముదాయించబోయా.

"బలేవాడివిరా! మొక్కయి వంగనిది మానై వంగదని పెద్ద ఉపన్యాసాలిస్తావ్. మళ్లీ ఇప్పుడేమో..." నన్ను నెత్తిపై మొత్తకుండానే దెప్పిపొడిచినట్లుగా అనేశాడు, చిన్నగా నవ్వుతూ

"ఉపన్యాసాలు బయటివారికే అని తెలుసుకోవడానికి చాలా రోజులు పట్టిందన్నయ్యా. మన దాకా వస్తే అవి ఉట్టి ఉసొలు... అంటే ఎందుకూ కొరగావు పనికిరావు!" నా మాటల్లోనే తెలియని వైరాగ్యం ధ్వనించింది.

"అలా అందరూ అనుకోబట్టే ఈ ఇంగ్లీషు దరిద్రం మనల్ని

వదిలిపెట్టడం లేదు" వాపోతున్నట్లుగా నిట్టూర్పు విడిచాడు.

''చూశావా... ఇంగ్లీషు వద్దు వద్దంటూనే ఇంగ్లీషు అన్నపదాన్ని కూడా ఆంగ్లం అనలేకపోతున్నావ్. ఆఫీసులో బయట అవసరమైన చోట ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడతావ్' ఉండబట్టలేక అన్నాను.

''నేను ఇంగ్లీషు మాట్లాడ్డం కేవలం ఉద్యోగ బాధ్యతల్లో. నా భాష, భావం ఎదుటి వ్యక్తికి అర్థం కాదనుకున్నప్పుడే మాట్లాడతాను. అది బతుకు కోసం, తెలుగు ఆత్మాభిమానం నిలుపుకోవటం కోసం" కాస్త ఆవేశంగా అనేశాడు.

''ఏంటండీ ఇది? రాకరాక అతనొస్తే గొడవ పడుతున్నారు" మా వదిన నా పార్టీలోకి వచ్చేస్తున్నట్టుగా అంది.

''గొడవేముందొదినా.... అన్నయ్య అన్న దాంట్లో తప్పు లేదుగా! నాకూ అనిపిస్తుంది. కానీ ఏం చేస్తాం?"

''ఏం చేస్తాం, ఏం చేస్తాం అనుకుంటే ఏమీ చేయలేం రా. ఎవడో ఒకడు ముందుకు రాకపోతే ఏదీ కాదు. నా మట్టుకు నేను పిల్లల్ని తెలుగు మీడియంలోనే వేస్తానంటే, ఈ పెద్దవాళ్ల చాదస్తంతో వారిని ఇంగ్లీషు మీడియంలో చేర్పించాల్సి .వచ్చింది. పెద్దవారిని బాధపెట్టి నేను బావుకునేది ఏమిటని అప్పుడు ఆలోచించి, తప్పు చేశానేమో ననిపిస్తోందిరా!" అన్నాడు.

ఆయనలోని ఆవేదనను అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు నాకు. సరిగ్గా రావాల్సిన సమయం లోనే ఆ ఇంటికి వచ్చాననిపించింది. నిజమే. మొన్నామధ్య, తెలుగు చానెల్‌లో ఓ ప్రముఖనటుడు చెబుతున్నాడు 'తెలుగువారందరం తెలుగులోనే మాట్లాడదాం' అని. ఆయన ప్రకటన అయి పోగానే మరో ప్రముఖసాహితీవేత్త మళ్లీ అదేవిషయాన్ని చెప్పాడు. అప్పుడు ఎంత ఆవేదన కలిగిందో నాకు. ఏమిటి మన భాషను, మాతృభాషను మనం మాట్లాడమని చెప్పే దుఃస్థితి ఎందుకు వచ్చిందా అని మనసు విలవిల్లాడింది. ఇప్పుడూ అంతే.

''టీ తీసుకోండి" అంటూ రెండు కప్పులు ఓ ట్రేలో పెట్టుకు తీసుకువచ్చింది వదిన.

చిన్నగా మనసు ఒక్కసారి నవ్వుకుంది. టీ... కామన్ పదమైపోయింది. తెలుగులో తేనీరు. ఎంతమంది అనగలరు తేనీరు తీసుకోండి అని, పత్రికల్లో ఆ పదం చూడడం తప్ప! ఆ రంగు నీళ్లను చప్పరిస్తూ 'అ...అన్నయ్యా రేపు వరంగల్‌కు వెళుతున్నా. మా అబ్బాయి సుశ్రుత్‌కు అక్షరాభ్యాసం. బాసర వెళ్లే ఆర్థికస్తోమత నాకెలాగూ లేదు. బాసర నుంచి ఓ పూజారి వస్తున్నారని నిన్ననే రవన్నయ్య ఫోన్ చేసి చెప్పాడు. వెళదామనుకుంటున్నా నువ్వూ వరంగల్ వెళ్లి వచ్చి చాలా రోజులైంది కదా. పెద్దమ్మవాళ్లకు ఏమైనా చెప్పమంటావా?" లిస్ట్ చదివినట్లుగా టకటకా చెప్పేశా.

''హు..." అన్నాడు.

ఆ పదం వచ్చేటప్పుడు ఆయన ముఖంలో మనసులో ఏదో వైరాగ్యం. మా వదిన, బేతాళుడు తిరిగి చెట్టెక్కినట్లుగా, మళ్లీ వంట గదిలో పనుల్లో నిమగ్నమైపోయింది.

'హౌ మెనీ మెంబర్స్ ఆఫ్ పాండవాస్? ఆన్సర్ ఈజ్ ఫైవ్ మెంబర్స్" దీపూ బట్టీ పడుతోంది.

''ఏంటన్నయ్యా, అదోలా అయిపోయావ్?"

''ఏం చేస్తాంరా. ఒకప్పుడు వరంగల్ అనగానే మనసు ఏదో తెలియని అనుభూతిని ఆలింగనం చేసుకునేది. అమ్మానాన్నలను చూడడం, వారితో గడపడం, మాట్లాడడం, స్నేహితులందరితో చెట్టాపట్టాల్ వేయడం, సినిమాల కెళ్లడం... ఇవన్నీ తలుచుకుంటే మనసు ఉప్పొంగిపోయేది. ఈ దేహాన్ని, కుటుంబాన్ని సంరక్షించుకునేందుకు ఉద్యోగం పేరుతో అందరికీ దూరంగా ఉన్నా, అప్పుడప్పుడు వెళ్లి అయినవాళ్లందరినీ పలకరిస్తున్నప్పుడైనా ఆ ఆనందం ఉండేది. కానీ ఇప్పుడు ఫోన్.. ఫోన్.. అందులో మళ్లీ సెల్... దాని శబ్దం... దాని తర్వాత అమ్మానాన్నలు మాట్లాడిన మాటల శబ్దం... ఓ చూపు లేదు. ఆప్యాయత లేదు. ఆ పలకరిం చేప్పుడు వారు పొందే అనుభూతి ఏమిటో తెలిసేందుకు ఆస్కారమే లేదు. యోగక్షేమాలన్నీ ఫోన్‌లోనే. ఇక నువ్వు వెళతానన్నా విషయాలు చెప్పడానికి ఏమున్నాయి? నిన్ననే అమ్మ ఫోన్ చేసింది. మాట్లాడాం. అంతే. అక్షరాభ్యాసానికి నాకు రావాలని ఉన్నా, నాకు సెలవు దొరకదన్న విషయం నీకు తెలుసు. ఇక వదిన, పిల్లలు, వంటిల్లుతో ఎప్పుడూ ఖాళీ లేకుండానే గడుపుతుంది. రాలేకపోతున్నందుకు బాధగా ఉందని అబద్ధం చెప్పను. ఏమీ అనుకోకు. సాయంత్రం కలుస్తావ్ కదా?" అన్నాడు.

''ఏమనుకునేదేముందన్నయ్యా. వెళ్లొస్తాను" అని సెలవు తీసుకుని తిరుగు పయనమయ్యా.

కండక్టర్ నా దగ్గరికి వస్తూనే "యస్ టికెట్!" అన్నాడు. కాస్త వింతగా కూడా అనిపించింది. దాన్ని తెలుగులోకి తర్జుమా చేస్తే, "ఔను చీటీ" అని. అంత బాగుండదు. కొన్నిటిని మనం తెలుగులో పలకలేనంత ఘోరంగా మార్చేసింది ఇంగ్లీష్-అనిపిం చింది. టికెట్ తీసుకుని యథాలాపంగా ఆలోచనల్లో పడిపోయా. మా అబ్బాయిని తెలుగు మీడియంలో చేర్పించాలా, లేక ఇంగ్లీషు మీడియంలో చేర్పించాలా- అన్న సందిగ్ధం కొంతవరకు తీరినట్లే అనిపించింది.

కండక్టర్ నా దగ్గరికి వస్తూనే ''యస్ టికెట్!" అన్నాడు.

కాస్త వింతగా కూడా అనిపించింది. దాన్ని తెలుగులోకి తర్జుమా చేస్తే, ''ఔను చీటీ" అని. అంత బాగుండదు. కొన్నిటిని మనం తెలుగులో పలకలేనంత ఘోరంగా మార్చేసింది ఇంగ్లీష్-అనిపించింది. టికెట్ తీసుకుని యథాలాపంగా ఆలోచనల్లో పడిపోయా. మా అబ్బాయిని తెలుగు మీడియంలో చేర్పించాలా, లేక ఇంగ్లీషు మీడియంలో చేర్పించాలా-అన్న సందిగ్ధం కొంతవరకు తీరినట్లే అనిపించింది. తెలుగు మీడియంలో చదువుకున్న నేను అనుభవించిన జీవితం కూడా చాలా చిత్రంగా సాగింది. డిగ్రీ అయ్యాక ఎం.ఏ. ప్రవేశపరీక్ష తెలుగులో కూడా ఉండడంతో ఆ మాధ్యమంలోనే రాశా. కానీ తీరా పాఠాలు చెప్పేటప్పుడు, ఉపన్యాసకులందరూ ఆంగ్లంలోనే దంచేసేవారు. రెండు-మూడు రోజులు ఏమీ అర్థం కాలేదు. అప్పటివరకు ఇంగ్లీషు చదివినా, అదేదో పరీక్షల కోసం గైడ్‌లు ఫాలో అయిపోవడమే తప్ప, వచ్చిందీ లేదు, చచ్చిందీ లేదు. విద్యార్థులమంతా హాస్టల్‌లో ఉండేవాళ్లం. ఓ రోజు అందరం కూర్చొని, ''రేపటి నుంచి తెలుగు మీడియంలో బోధించమని అడుగుదా"మని నిర్ణయించుకుని, పొద్దున ఆ విషయాన్ని వారి ముందుంచాం. ఇద్దరు-ముగ్గురు బాగానే స్పందించారు. కానీ మరో ఇద్దరు లెక్చరర్లు కుదరదన్నారు. ఇప్పటికిప్పుడు తెలుగులోకి తర్జుమా చేసుకుంటూ చెప్పాలంటే సాధ్యం కాదు. అందుకని, ''సర్ మేం తెలుగు మీడియంలో చదువుకున్నాం. అందరూ దిగువ మధ్యతరగతివారే. మేమేమో విజ్ఞానాన్ని పెంచుకుందామని వచ్చాం. కానీ ఆంగ్లంలో చదివి బట్టీపట్టి పరీక్షలు రాయాలనుకోవడం లేదు" అన్నాను వినయంగా.

''ఔనయ్యా, కాదనడం లేదు. ఇందాక సర్ అన్నావు... దాన్ని

అయ్యా అని తెలుగులో అనగలవా. అలానే కొన్ని పదాలు తెలుగులో చెప్పడానికి బాగుండవు. మీరే కష్టపడి అర్థం చేసుకోవాలి" బదులిచ్చాడు లెక్చరర్.

"ఏం మాట్లాడాలో తెలియడం లేదు సార్. కష్టపడి చదవడం మటుకు చేయగలం గాని, కష్టపడి అర్థం చేసుకోవడం మా వల్ల అయ్యేలా లేదు సార్!" మా వెనకాల నుంచి సతీశ్ అనే విద్యార్థి.

"సరే చూద్దాం" అంటూ బయటికి వెళ్లిపోతున్న లెక్చరర్‌ను, అభినందనపూర్వకంగా చూశాం అందరం. అలా అలా అంతా నా జీవితం ఓ తెలుగైపోయింది. ఒకానొక రోజు ఇంగ్లీషు రాదనే ఉద్దేశంతో, ఇచ్చే అవకాశాన్ని కూడా మా కంపెనీ ఇతరులకు ఇచ్చేసింది. బస్సుతో పాటు నా ఆలోచనలూ ఆగిపోయాయి.

ఇంటి దారి పట్టాను. ఓ పది నిమిషాలు గడిచాక ఇంట్లో దూరిపోయా. మా అబ్బాయి మధ్యాహ్నం కునుకు తీస్తున్నాడు.

"ఏమైందండీ, రేపు వెళ్లడం గ్యారంటీయేనా?" ఉత్కంఠ భరించలేనన్నట్లుగా అడిగింది, నా భార్యామణి.

"ఏమే, ఎంత చదువుకున్నావ్ నువ్వు. నేను ఎక్కువగా ఇంగ్లీషు పదాలు ఉపయోగించను. గ్యారంటీ లాంటి పదాలు నీకెలా వస్తాయే?" ఇంగ్లీషుపై చిరాకునంతా అధికారబలంతో పెళ్లాంపై చూపెట్టా.

ఎప్పట్లాగే చాటంత మొఖాన్ని మొంటెంత చేసుకుని, "నాకేంటి, ఎప్పుడు బయలుదేరమంటే అప్పుడు బయలుదేరుతా!" అంటూ కుర్చీలో కూలబడిపోయింది.


"సర్లే... ఈ మూతి విరుపులకేం గాని ఇవ్వాళ సెలవు చెప్పేశా. కాస్సేపు పడుకుంటా. శ్రీనన్నయ్య వస్తానన్నాడు. వస్తే లేపు. లేకుంటే నేను లేచేవరకు లేపకు!" హుకుం జారీ చేస్తున్నట్లుగా చెప్పేస్తూనే, లుంగీ చుట్టేసి మంచంపై వాలిపోయా.

000

"బావగారొచ్చారండీ" అనుకుంటున్నట్లుగానే వచ్చి, తట్టిలేపుతూ అంది, నా భార్యామణి.

ఏదో పెండలాడే నిద్రలేస్తున్నవాడిలా బద్ధకంగా ఒళ్లు విరుస్తూ, లేచి హాల్లోకి వెళుతూనే, "కాసిన్ని రంగు నీళ్లు మా ఇద్దరికి ఆరబోస్తావా?" అన్నాను. రంగు నీళ్లంటే ఆమెకు అర్థం అవుతుంది. ఎప్పుడూ ఇంట్లో వాడే పదమే అది.

"ఎన్నడూ లేనిది మధ్యాహ్నం నిద్రేంట్రా?" టీపాయ్‌పై ఉన్న వార పత్రికను చేతిలోకి తీసుకుంటూ అన్నాడు, శ్రీనన్నయ్య.



"ఏముందన్నయ్యా, సెలవు కదా!" ఆటోమాటిగ్గా నా ఎడమచేతి వేళ్లు, తలని గోకేశాయి.

"ఏంటోరా. ఇంగ్లీషు మీద ఉన్న కోపంతో నీతో సరిగా మాట్లాడ లేకపోయా."

"నేనర్థం చేసుకోగలనులే అన్నయ్యా."

"ఏంట్రా, ఆలోచిస్తే చాలా వింతగా అనిపిస్తోంది. మొన్నటికి మొన్న ఇలాగే ఏం ప్రశ్న వేసిందో తెలుసా? 'నాన్నా హూ ఈజ్ సీతాస్ హస్బెండ్' అని. ఒళ్లు మండిపోయిందనుకో. 'హూ ఈజ్ ధృతరాష్ట్ర, హూ ఈజ్ కర్ణాస్ మదర్, వాటీజ్ ద మీనింగ్ ఆఫ్ స్వయంవర'-ఇలా పౌరాణికాలను ఖూనీ చేసే బదులు, అందులోని నీతేంటో పిల్లలకు చెప్పాలనుకుంటే కనీసం తెలుగులోనే చెప్పొచ్చు కదా. అలా వీలు కాదనుకుంటే రాముడి పేరును రాబర్ట్ అని మార్చి రామాయణాన్ని ది స్టోరీ ఆఫ్ రాబర్ట్ అనో, భీముడి పేరును బికేల్ అని మార్చి ది స్టోరీ ఆఫ్ బ్రదర్స్ ఫైట్ ఫర్ ఫైట్ అనో, పెట్టొచ్చు కదా. సీత పేరును సెరీనా అనో ఇంగ్లీషులోకి తర్జుమా చేయవచ్చు కదా. అప్పుడు నాలాంటివాడికి బాధ తప్పుతుంది. పిల్లలకు కూడా సులభంగా నీతేంటో తెలుస్తుంది" అంటూనే, మళ్లీ "ఈ ఇంగ్లీషు తగులుకుందేంట్రా ఖర్మ కాకపోతే?" అంటూ, ఓ ఐదు వందల నోటు తీసి అప్పటికే లేచి ఇంట్లో తిరుగాడుతున్న మా అబ్బాయి సుశ్రుత్‌ను దగ్గరకు తీసుకుని, వాడి చొక్కా జేబులో నేను వద్దంటున్నా కుక్కేశాడు. వాడి బుగ్గన మనస్ఫూర్తిగా ముద్దు పెట్టుకుని, "ఆడుకో పో" అంటూ, "నేను వెళతాన్రా. మళ్లీ ఎప్పుడూ రాక?" అన్నాడు.

"ఎల్లుండొచ్చేస్తాం. సెలవు కూడా ఎక్కువ రోజులివ్వలేనన్నారు" అంటూ ఆయన్నే అనుసరించా.

"వెళతానమ్మా" నా భార్య వైపు చూస్తూ బయటికి నడిచాడు అన్నయ్య.

"ఎందుకండీ, మీ ఇద్దరికీ ఇంగ్లీషంటే అంత వైరాగ్యం?" తెలిసి వాడిందో, తెలియక వాడిందో గాని, వైరాగ్యమన్న పదాన్ని మాత్రం సందర్భానుసారమే ఉపయోగించినందుకు, ఎంత సంతోషం కలిగింది.

"ఓ రోజు రవన్నయ్య వాళ్లింటి కెళ్లినప్పుడు, సందీప్ ఐదు అన్నప్పుడు ఏమన్నాడో గుర్తుందా?" అన్నాడు ఉత్సాహంగా.

"లేదు."

"అంటే ఎంత డాడీ అన్నాడు. ఐదు అంటే కూడా తెలియనంతగా వారు ఇంగ్లీషుతో మమేకమైపోయారు. ఐదు అంటే ఫైవ్ అని అన్నయ్య వివరించాల్సివచ్చింది. మనం ముందుగా బతకాల్సింది రాష్ట్రంలో. ఏ మూలకు వెళ్లినా తెలుగు బోర్డులే రాసి ఉంటాయి. రైల్వే స్టేషన్లు, బస్ స్టాపుల్లో మూడు రకాల భాషలున్నా, అది తెలుగువారి కోసం రాసింది కాదు. కనీసం తెలుగునే చదవకపోయి నప్పుడు, ఏ భాషలో చదువుకుంటే ఏం లాభమని, మా అన్నయ్య కూడా రోజు ఇంట్లో తెలుగు బోధిస్తున్నాడు. అందుకని..." ఇక మళ్లీ ప్రశ్నించకుండా ఉండేందుకు వివరంగా చెప్పేశా. నేను ఊహించినట్లుగానే ఆమె మరో ప్రశ్న లేవనెత్తలేదు.

000

ఇరవై ఏళ్లు గడిచాయి. ఈ ఇరవై ఏళ్లలో ఎన్నో జరిగిపోయాయి. తెలుగులోనే ఏడ్వడం. తెలుగులోనే మాట్లాడడం, తెలుగులోనే నిద్రపోవడం, తెలుగు నములుతూ, తెలుగు... తెలుగు...

మా అబ్బాయి తెలుగు మాధ్యమంలోనే చదివి తెలుగు భాష- ఆంగ్లప్రభావం అనే అంశం మీద పిహెచ్.డి. తీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన తానావారు అతన్ని అమెరికాలో అభినందించాలని నిర్ణయించుకోవడం, ఆ విషయాన్ని ఓ లేఖలో వివరించడం ఇట్టే జరిగిపోయాయి. మరో రెండు నెలల తర్వాత, మా అబ్బాయి అభినందన సభ ఏర్పాటు చేసినట్లు మరో లేఖ కూడా వచ్చింది.

నా ఆనందానికి అవధులు లేవు. మా అబ్బాయి పిహెచ్.డి. పట్టా తీసుకుని వేదికపై నుంచి దిగి వచ్చి నా కాళ్లపై, మా ఆవిడ కాళ్లపై తల పెట్టి, ఆనందబాష్పాలు రాల్చిన ఆ క్షణాలు, మళ్లీ ఓ సారి గుర్తుకు వచ్చాయి. వాడిని లేపి గట్టిగా కౌగిలించుకుని నేను పొందిన సంతృప్తి, ఎన్ని వేల కోట్ల రూపాయల విలువ చేస్తుందో కూడా చెప్పలేను. నేను వ్యక్తిగతంగానే కాకుండా, ఉద్యోగరీత్యా కూడా సంతుష్టస్థాయికి చేరుకున్నా.

(మిగతా వచ్చే వారం)